క్లుప్తంగా

దరఖాస్తుల గడువు పొడిగింపు

టేకుమట్ల: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టీఓఎస్ఎస్) ఎస్సెస్సీ, ఇంటర్ కోర్సుల అడ్మిషన్లు 2025–26 విద్యా సంవత్సరానికి గాను గడువు పొడిగించినట్లు మండల కో–ఆర్డినేటర్ చాగంటి ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీసేవా ద్వారా దరఖాస్తుల సమర్పణ చివరి తేదీ ఈనెల 30 వరకు ఉందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

గర్భిణులకు సీమంతం


సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

టేకుమట్ల: మండలంలోని రామకృష్ణాపూర్(వి) గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణమాసోత్సవాలలో భాగంగా బిడ్డకు మొదటి 1000 వెయ్యి రోజుల ప్రాముఖ్యతను సరోజన వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పూర్ణిమ, హేమలత, రజిత, ఆశ పావని, ఆయాలు సారమ్మ, లావణ్య, రజిని, వెలిశాల సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: ఇన్‌చార్జ్ డీటీడీఓగా జనార్దన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎమ్మెల్యేను కలిసిన జర్నలిస్టులు

భూపాలపల్లి రూరల్: నూతనంగా ఎన్నికైన టీడబ్ల్యూఎస్ జిల్లా నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ నాయకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రం సతీష్‌కుమార్, జిల్లాప్రధాన కార్యదర్శి సారేశ్వర్‌రావు, కోశాధికారి రాంబాబు, జాయింట్ సెక్రెటరిలు శ్రీదర్, దుర్గయ్య, జాతీయ కౌన్సిల్ సభ్యులు సంజీవ రావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించాలని నిరసన



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురంలో మానసపల్లిలో శుక్రవారం గ్రామస్తులు తాగు నీటి కోసం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు సురేష్ మహారాజ్ మాట్లాడుతూ.. తాగు నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి తాగు నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. మిషన్ భగీరథలో వర్కర్లకి జీతాలు రాకపోవడం ధర్నా చేస్తున్నారని తెలిపారు. దీంతో మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని మోటార్లు, చేతి పంపులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మాలధారణతో మానసిక ప్రశాంతత

- అధ్యాత్మిక చింతనలో యువత
- దుర్గామాతకు ఏటా పెరుగుతున్న భక్తులు


అమ్మవారికి పూజలు చేస్తున్న మాలధారులు

రేగొండ: ప్రస్తుత ఆధునిక యుగంలో యువత స్మార్ట్‌ఫోన్లు, వీడియోలు, పార్టీలు, సరదాలతో ఎల్లప్పుడు గడిపేస్తున్నారు. కానీ రానురాను వారి ఆలోచనల్లో మార్పు వస్తుంది. వారిలో దైవచింతన రోజురోజుకూ పెరుగుతూ సనాతన ధర్మం వైపు అడుగులు వేస్తున్నారు. ఆది పరాశక్తిగా భావించే దుర్గామాతకు యువత ఎక్కువ సంఖ్యలో మాలను ధరించడం వారిలో భక్తిభావాన్ని పెంచుతోంది. సోమవారం నుంచి దేవీశరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఊరురా దుర్గమాతను ప్రతిష్ఠించగా యువకులు పెద్ద ఎత్తున మాలలు ధరించడం విశేషం. చిన్న పిల్లలు, మహిళలు సైతం దుర్గమ్మ సేవపై ఆసక్తితో మాలలు, కండువాలు ధరించారు. ఉమ్మడి రేగొండ మండలంలో దాదాపు 70 మంది దుర్గామాత మాల వేశారు.

భక్తి భావంతో..

దుర్గమాత మాల అంటే అత్యంత పవిత్రమైంది. దీనిని ధరిస్తే కఠిన నియమాలు పాటించాలి. హరిషడ్వర్గాలు (కామం, క్రోదం, మోహం, లోబం, మదం, మశ్చ్యరం) అదుపులో పెట్టుకోవాలి. నియమనిష్టలతో ఉపవాస పూజలు చేయడంతో ఇది సాధ్యం అవుతుందని పండితులు, పది పర్యాయాలు మాల ధరించిన పెద్దలు చెప్తున్నారు. పిల్లలు చిన్నప్పుడే మాల ధరించడంతో వారిలో భక్తి భావం పెరగడమే కాకుండా క్రమశిక్షణ అలవర్చుకోవడానికి అవకాశముంది. యువత చెడు అలవాట్లను దూరం చేసుకుని మంచి సన్మార్గంలో నడవడం, పనిపై ఏకాగ్రత కూడా పెరుగుతుంది. దుర్గాదేవిని మనసు పెట్టి కొలిస్తే కోరిన కోరికలు తీరుతాయనే నమ్మకం కలగడంతో మాలను ధరించే భక్తుల సంఖ్య పెరుగుతోంది.

అమ్మవారి సన్నిధిలో..



దేవి నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు అమ్మవారి సన్నిధిలో గడపడం మనస్సుకు చాలా ఆనందంగా ఉంటుంది. నియమనిష్టలతో కూడిన దీక్ష ఆరోగ్యానికి చాలా మంచిది. అందుకే ప్రతిసారి భవానీ మాలధారణ స్వీకరిస్తా. దైవ సన్నిధిలో ఉండటం వల్ల అధ్యాత్మిక భావాలు పెరుగుతాయి.

\- నిమ్మల రాజు, కొత్తపల్లిగోరి

మొదటిసారి వేశా..



దుర్గమ్మను కొలిస్తే అన్ని విధాలుగా మంచి జరుగుతుందని తెలుసుకున్నా. అందుకే నవరాత్రుల సందర్భంగా నేను మొదటి సారి మాల వేశా. ప్రతి రోజూ అమ్మవారికి నిష్టతో పూజలు చేసి, అమ్మవారి అనుగ్రహం పొందాలని నాలాగే చాలా మంది యువకులు ఆసక్తితో మాల ధరించారు.

\- సామల సురేందర్ రెడ్డి, రేగొండ

ఏకాగ్రత పెరుగుతుంది



మాలను ధరించి దుర్గామాతను పూజిస్తే అన్నివిధాలుగా మంచి జరుగుతుంది. యువత ప్రాధాన్యతతో మాలలు వేయడం మంచి తరుణం. దీంతో దురలవాట్లు దూరం అవుతాయి. జపం చేయడంతో ఏకాగ్రత పెరుగుతుంది.

\- రవి, అర్చకుడు, కొత్తపల్లిగోరి

తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరి

- ప్రిన్సిపాల్ విజయదేవి

మల్హర్: విద్యార్థుల విద్యాపురోగతి, వ్యక్తిత్వ వికాసం కోసం అందరం కలిసి పనిచేయాలంటే తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరిని ప్రిన్సిపాల్ విజయదేవి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఇంటర్మీడియేట్ కళాశాలలో ప్రిన్స్‌పాల్ విజయదేవి ఆధ్వర్యంలో శుక్రవారం మెగా పేరెంట్ టీచర్ సమావేశం నిర్వహించారు. పిల్లల హాజరు క్రమ శిక్షణ, విద్యాప్రగతి, ప్రతిభ, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశలపై తల్లిదండ్రులు, అధ్యాపకులతో ప్రిన్సిపాల్ చర్చించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం విద్యార్థుల హాజరు శాతం పెరుగుదల కోసం ఎఫ్ఆర్ఎస్ ప్రారంభించారన్నారు. దీని ద్వారా ఎప్పటికప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులకు హాజరు నమోదుపై మెసేజ్ రూపంలో సమాచారం వస్తుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి ఉచిత, నాణ్యమైన విద్యనందేచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కళాశాల కమిటీ గౌరవ అధ్యక్షులు చింతలపల్లి మల్హర్‌రావు, చైర్మన్ చిగిరి మీనా, కమిటీ సభ్యులు వెంకటేశ్, అధ్యాపకులు కళాశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో తల్లిదండ్రులు, అధ్యాపకులు

నల్లబ్యాడ్జీలతో ఎన్యుమరేటర్ల నిరసన

కాళేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేలో పాల్గొన్న తమకు ఇప్పటివరకు గౌరవ వేతనం అందలేదని ఎన్యుమరేటర్లు, ఇతర సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన తెలిపారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద స్థానిక సంస్థల ఎన్నికల సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించిన అనంతరం నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రావాల్సిన పారితోషకాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాచర్ల శ్రీనివాస్, పసుల శంకర్, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పోతుగంటి అర్జున్, పీఆర్‌టీయూ తెలంగాణ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎల్కటి శరత్, కురుసం అనిల్‌కుమార్, రాజ్ కుమార్, సాంబయ్య, రవీందర్, శ్యామ్, రాంబాబు, తిరుపతి, కోటేష్, పోచమల్లు, సునీత, వసంత, స్రవంతి, నవీన, మమతలు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఎన్యుమరేటర్లు

దుర్గామాత ఆశీస్సులు అందరిపై ఉండాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి/గణపురం: దుర్గామాత చల్లని దీవెనలు, ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని కేటీకే–6 ఇంక్లైన్, కేటీకే–5 ఇంక్లైన్, భూపాలపల్లి ఏరియా మైన్స్ రెస్క్యూ స్టేషన్‌తో పాటు గణపురం మండలం బసవరాజుపల్లి శివారులోని కేటీకే–8 ఇంక్లైన్‌లో ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డితో కలిసి దుర్గమాత పూజల్లో పాల్గొన్నారు. అదేవిధంగా గణపురం మండలం బుద్ధారం గ్రామంలోని శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మహాన్నదాన కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమ్మవారి కృపతో ప్రజలంతా దినదినాభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే దుర్గా దేవీని వేడుకున్నారు. ఈ కార్యక్రమాలల్లో కాంగ్రెస్ నేతలు, సింగరేణి కార్మికులు ఉన్నారు.


కేటీకే 5వ గనిలోని వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర, జీఎం రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు

అమ్మవారికి ప్రత్యేక పూజలు


మొగుళ్లపల్లి: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

టేకుమట్ల: దేవినవరాత్రోత్సవాల సందర్భంగా మండలంలోని రామకిష్టాపూర్(టి)లో ఐదో రోజు దుర్గాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు లక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివరామకృష్ణ భజనమండలి సభ్యుల సేవా సహకరంతో మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో కొలువుదీరిన దుర్గామాత శుక్రవారం ఐదో రోజు లలితాత్రిపురసుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సూరినేని మణికర్, తాటికొండ వెంకటేశ్వర్ల కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదలను అందజేశారు. వేణవంక నవీన్, ప్రసాద్, భజనమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మొగుళ్లపల్లి: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

స్థానిక ఎన్నికల ప్రక్రియపై శిక్షణ


మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేందర్


టేకుమట్ల: మాట్లాడుతున్న ట్రైనర్ హరి ప్రసాద్


కాటారం: మాట్లాడుతున్న ఎంపీడీఓ బాబు

మొగుళ్లపల్లి: ఎన్నికల ప్రక్రియపై పీఓ, ఏపీఓలు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ సురేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై పీఓలు, ఏపీఓలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ సురేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ చాలా ముఖ్యమైనదని ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అవగాహన అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కుమారస్వామి, మాస్టర్ ట్రైనర్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

టేకుమట్లలో..

టేకుమట్ల: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా మండలంలోని ఆశిరెడ్డిపల్లి రైతు వేదికలో ప్రిసీడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, మండల పంచాయతీ అధికారి సురేష్, మాస్టర్ ట్రైనర్ హరి ప్రసాద్, సాగర్ పాల్గొన్నారు.


కాళేశ్వరం: శిక్షణ ఇస్తున్న అధికారులు

కాటారం: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై పీఓ, ఏపీఓలకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఎంపీడీఓ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా పాటించాల్సిన నిబంధనలు, విధుల నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ట్రైనర్లు అవగాహన కల్పించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన విధులకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఎంపీఓ వీరస్వామి, ట్రైనర్లు, పీఓ, ఏపీఓలు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై పోలింగ్ సిబ్బందికి మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఎంపీడీఓ జయశ్రీ , తహసీల్దార్ షేక్ ఇమామ్‌బాబా ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రామకృష్ణ, ఎంఈఓ రఘుపతి, ట్రైనింగ్ రిసోర్స్‌పర్సన్ గంపల స్వామి , లెక్చరర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులకు శిక్షణ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం రైతువేదిక వద్ద మహదేవపూర్, పలిమెల మండలాలల్లో ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రిసైడింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌ల శిక్షణ కార్యక్రమాన్ని శిక్షణ అధికారి టి.రామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల శిక్షణకు సంబంధించి ప్రిసైడింగ్ ఆఫీసర్లు 34, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు 76, గ్రామపంచాయతీ ఎన్నికల శిక్షణకు ప్రిసైడింగ్ ఆఫీసర్లు 241 మంది హాజరయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మహదేవపూర్, పలిమెల ఎంపీడీఓలు రవీంద్రనాథ్, ప్రకాశ్, తహసీల్దార్ రామారావు, డిటీ కృష్ణ పాల్గొన్నారు.

‘భగీరథ’ కార్మికుల ధర్నా

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రొయ్యూర్ వాటర్ ట్రీట్‌మెంట్ మిషన్ భగీరథ ప్లాంట్‌లో పనిచేసే కార్మికులు శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు నెలల నుంచి వేతనాలు రావడం లేదన్నారు. పండుగ వస్తుంది.. పస్తులుండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. .

వెంకటాపురం(ఎం): నాలుగు నెలలుగా వేతనాలు అందించడం లేదని మిషన్ భగీరథ సిబ్బంది శుక్రవారం మండలంలోని పాలంపేటలోని మిషన్ భగీరథ కార్యాయం ప్రధాన గేటుకు తాళం వేసి ధర్నా నిర్వహించారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు అందించేలా చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

టేకుమట్ల: గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రామకిష్టాపూర్(టి) గ్రామానికి చెందిన బొమ్మ రాజేంద్ర ప్రసాద్ అనే యువకుడు హనుమకొండలోని ఓ కాలేజీలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. అక్కడే మిత్రులతో కలిసి గంజాయి సేవించే వాడు. అంతే కాకుండా తోటి మిత్రులకు సైతం గంజాయి సేవించేలా ప్రోత్సహించేవాడు. హైదరాబాద్‌లోని దూల్‌పేటలో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి హనుమకొండ, టేకుమట్ల, తదితర చోట్ల మిత్రుల సాయంతో ఇతరులకు విక్రయిస్తున్నాడు. అందులో భాగంగానే శుక్రవారం ఉదయం చిట్యాల నుంచి టేకుమట్లకు 1.5కిలోల గంజాయితో వస్తూ రామకిష్టాపూర్(టి) శివారులో పోలీసులను చూసి అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో పోలీసులు పట్టుకుని విచారించగా అతని వద్ద గంజాయి దొరికింది. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దాసరి సుధాకర్ తెలిపారు.


నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

గణపురం: పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బొల్లం భిక్షపతి (38) వారం రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ప్రమాదాల నియంత్రణకు చర్యలు

ఎస్ఎస్‌తాడ్వాయి: విద్యుత్ ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) మధుసూదన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కాటాపూర్ 33 కేవీ విద్యుత్ లైన్ కవరర్ కండక్టర్ పనులను ఆయన పరిశీలించారు. విద్యుత్ లైన్ పనులు పకడ్బందీగా ఉండాలన్నారు. ఉద్యోగులు పని చేసే సమయంలో అన్ని రకాల భద్రత పరికరాలను ఉపయోగించాలన్నారు. జీసీఎం రాజుచౌహన్, ఎస్ఈ మల్హార్, డీఈ నాగేశ్వర్‌రావు, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ లైన్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గణపురం: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా పార్టీ నాయకుడు బైరగాని కుమారస్వామి గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి పరకాలలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో బాధితుడిని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట గణపురం పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.


పరామర్శిస్తున్న గండ్ర

పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ


కాటారం: ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


చిట్యాల: కేక్‌కట్ చేస్తున్న నాయకులు

జిల్లా వ్యాప్తంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ దగ్గర చాకలి ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయుధ రైతంగా పోరాట యోధురాలు చాలకి ఐలమ్మ అన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్


భూపాలపల్లి రూరల్: ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు


భూపాలపల్లి రూరల్: కొంపెల్లిలో..


మల్హర్: కొయ్యూరులో..


భూపాలపల్లి రూరల్: ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి